క్లుప్తంగా

ఆరోగ్య రక్షణకు యోగా ముఖ్యం

తవణంపల్లె: ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి యోగా ఆయుధమని తవణంపల్లె ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలోని అన్ని సచివాలయాలు, పాఠశాలల్లో ఉదయం 7 గంటల నుంచి యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. మండలంలోని అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు యోగాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యోగా చేయడంతో ఆరోగ్యాన్ని కాపాడుకొని నిండు జీవితాన్ని పొందవచ్చునని అన్నారు. ప్రతి రోజు యోగా చేయడం అలవర్చుకోవాలని సూచించారు.

బదిలీ టీచర్లకు సన్మానం



తవణంపల్లె: మండలంలోని పాన్నేడుపల్లె ప్రాథమిక పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులు గణేష్, సీమన్‌ను మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బృందం శాలువాలు కప్పి, పూలదండలు వేసి ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీత, అఖిలభాను, ఎంటీఎస్ ఉపాధ్యాయులు, గ్రామస్తులు పండుసాహెబ్, చాంద్‌బాషా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

- కేసు నమోదు

తవణంపల్లె: మండలంలోని దిగువ మోదలపల్లె ఎస్సీ కాలనీకి చెందిన ఓ బాలిక(13)పై లైంగిక దాడి జరిగినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. పోలీసుల కథనం.. దిగువమోదలపల్లె ఎస్సీ కాలనీకి చెందిన సురేంద్రబాబు(36).. అదే గ్రామానికి చెందిన ఓ బాలిక అంగడికి వెళ్తుండగా ఇంట్లోకి లాక్కెళ్లి అఘాయిత్యానికి ఒడిగట్టాడు. బాధితురాలు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ఉరేసుకుని యువకుడి మృతి

తవణంపల్లె: మండలంలోని మిట్టపల్లె సమీపంలో హంద్రీ–నీవా కాలువ దగ్గర యువకుడు చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 15 మంది కూలీలు ఎస్‌–3 జ్యూస్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన కసబ్(25) ఫోన్‌లో ఎవరితోనే మాట్లాడుతూ ఫ్యాక్టరీ నుంచి వెళ్లిపోయి హంద్రీ–నీవా కాలువ దగ్గర చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. స్థానికులు కనుగొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మహాద్వార నిర్మాణానికి భూమిపూజ



భూరుగులపల్లె వద్ద భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

గుడుపల్లె: మల్లప్పకొండపై కొలువై ఉన్న శ్రీ స్వర్ణగిరి మల్లేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డుపై సంగనపల్లె గ్రామస్తులు మహాద్వార నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. కొండపై వెళ్లె రోడ్డులోని భూరుగులపల్లె వద్ద దీనిని నిర్మించేందుకు పండితులతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు మల్లప్పకొండ ఆలయం ప్రత్యేకతను తెలియజేయడానికి ఈ మహాద్వార నిర్మాణానికి పూనుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సంగనపల్లె బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు దారుణం



యశోదమ్మను పరామర్శిస్తున్న పెద్దిరెడ్డి

సదుం: మహిళలపై టీడీపీ నాయకులు దాడులకు పాల్పడటం దారుణమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమల మండలం కొల్లావారిపల్లెలో టీడీపీ నాయకులు భూ తగాదాల నేపథ్యంలో దాడి చేయడంతో శనివారం యశోదమ్మ గాయపడింది. ఆమె స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందుతుండడంతో ఆయన పరామర్శించారు. గ్రామాలలో టీడీపీ నాయకుల దౌర్జన్యాలు ఎక్కువ అయ్యాయని, దీనిని ప్రజలు హర్షించరనేది గుర్తెరగాలని హితవు పలికారు. దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, పుత్రాజు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వీడితే సంపూర్ణ ఆరోగ్యం

మారుతున్న కాలానుగుణంగా ప్రజల జీవనశైలి మారిపోయింది. ఆహారపు అలవాట్లలోనూ మార్పులొచ్చాయి. సంపూర్ణ ఆరోగ్యానికి నిత్యం నడక, వ్యాయామం, యోగా, ధ్యానం తప్పనిసరిగా మారింది. ప్రధానంగా అజీర్తి నుంచి ఆర్థరైటిస్ వరకు, రక్తపోటు నుంచి గుండెపోటు వరకు, మధుమేహం నుంచి మానసిక సమస్యల వరకు ఏదైనా నయం కావాలంటే రోజూ వ్యాయామం, యోగా చేయాలి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో క్షణం తీరిక లేకుండా ఉద్యోగాల్లో తలమునకలయ్యే వారు శారీరక, మానసిక ఒత్తిడిని అధికమించేందుకు వ్యాయామన్ని తమ జీవన విధానంలో భాగంగా చేసుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రజల్లోనూ ఆరోగ్య స్పృహ పెరిగింది. తెల్లవారుజామునే లేచి యువకులు రోడ్ల వెంబడి పరుగులు పెడుతుండగా, పెద్దవారు నడక సాగిస్తున్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు నడవడం, యోగా చేయడం, వ్యాయామం చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చు. –ఐరాల



యోగా సాధన

- రోజూ నడకతో ఆరోగ్య ప్రయోజనాలు
- యోగా, ధ్యానంతో మానసిక ప్రశాంతత
- నిర్లక్ష్యంతో ఆరోగ్య సమస్యలు అధికం

ఐరాలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంతోపాటు బజారువీధి నుంచి చెంగనపల్లె, మతంపల్లె, 35 యర్లంపల్లె రహదారుల్లో నడక సాగిస్తున్నారు. పాఠశాల మైదానం, రోడ్ల వెంబడి వేకువజామున నడకకు చాలామంది వెళ్తున్నారు. అనంతరం మైదానానికి వెళ్లి కాసేపు సేదదీరి వ్యాయామం, యోగాసనాలు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. రోజురోజుకూ గ్రామాల్లో వాకర్స్ సంఖ్య పెరుగుతండడంతో రోడ్లు, మైదానాలు ఉదయం పూట సందడిగా కనిపిస్తున్నాయి.

నడకతో బోలెడు ప్రయోజనాలు

ప్రపంచ ఆరోగ్య సంస్థల ప్రకారం రోజుకు వెయ్యి అడుగులు నడిస్తే ఆయిష్షు 15 శాతం పెరుగుతుంది. 2,500 అడుగులు నడిస్తే హృదయ రోగాల బారిన పడే అవకాశం తగ్గుతుంది. 3,900 అడుగులు అయితే ప్రాణాంతక వ్యాధులు 25 శాతం దూరం చేయొచ్చు. 10 వేల అడుగులు నడిస్తే చాలా వరకు అనారోగ్య సమస్యలు దూరంగా ఉంటాయి. ఇలా చేస్తే రోజంతా ఉత్సాహంగా పనుల్లో పాల్గొనవచ్చు. ఆహారపు అలవాట్లలోనూ మార్పులు చేసుకున్నట్లయితే సంపూర్ణ ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చు.

దీర్ఘకాలిక రోగాలకు చెక్

రోజూ వ్యాయామంతోపాటు నడక సాధనతో అనేక లాభాలున్నాయని వైద్య, క్రీడా నిపుణులు సూచిస్తున్నారు. నడకను జీవితంలో భాగం చేసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని చెబుతున్నారు. కనీసం రోజూ 30 నిమిషాలు నడిస్తే జీర్ణశక్తి మెరుగుపడుతుందని, గంట నడిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, ముందస్తు మరణాల ముప్పు 20 శాతం తగ్గుతుందని, బరువు అదుపులో ఉంటుందని, ఒత్తిడి, ఆందోళన దూరం చేసి, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని, కండరాలు, ఎముకల దృఢత్వానికి దోహదం చేస్తుందని, దీర్ఘకాలిక రోగాలైన మధుమేహం, రక్తపోటు(బీపీ)లకు చెక్ పెట్టొచ్చని సూచిస్తున్నారు.

రోగ నిరోధక శక్తి పెరుగుతుంది



రోజుకు 40 నుంచి 50 నిమిషాలు నడిస్తే సరిపోతుంది. రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. మంచి పౌష్టికాహారం తీసుకోవాలి. 8 గంటలు నిద్రపోవాలి. రక్తపోటు అదుపులో ఉండాలంటే వంటలో ఉప్పు తక్కువగా ఉండాలి. ఈ రెండు ఇప్పటికే ఉన్నట్లయితే వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి. వ్యాయామం, వాకింగ్ నిత్యం చేస్తుండాలి. ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి.

–డాక్టర్ పూర్ణలత, ఐరాల

కండరాల సామర్థ్యం పెరుగుతుంది



మహిళలు, పురుషుల్లో 40–50 ఏళ్ల మధ్య కాల్షియం తగ్గి కొవ్వు నిల్వలు పెరుగుతాయి. కండరాలు బలహీనమవుతాయి. 60 ఏళ్లు వచ్చేసరికి కాలి ఎముక మధ్యలో నాళం పెద్దదై (ఆర్థోప్లోరోసిస్)గా మారుతుంది. ఎముకలు అరుగుతాయి. నడకతో వీటికి చెక్ పెట్టొచ్చు. 65–70 ఏళ్లలో మెదడు సంబంధిత వ్యాధులు వస్తాయి. చేతులు, కాళ్లలో వణుకు వస్తుంది. నడిస్తే కండరాల సామర్థ్యం, ఎముకలు పటుత్వం పెరుగుతుంది.

–డాక్టర్ ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారి, ఐరాల

24 ఏళ్లుగా వాకింగ్



నేను గత 24 ఏళ్లుగా ఉదయం, సాయంత్రం పూట వాకింగ్ వెళ్తున్నాను. దీంతో రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేస్తాను. ఈ రోజు వద్దు రేపటి నుంచి వాకింగ్ పోదాం. ఉదయం 5 గంటలకు వద్దు. 6 గంటలకు వెళ్దాం అంటూ 8 గంటలకు లేచే వారు సోమరితనం వీడాలి. ఏ పని ఉన్నా తప్పక వాకింగ్‌కు ఓ సమయం కేటాయించుకుంటే జీవితం ఆనందంగా సాగుతుంది.

–ప్రేమనాథ్, వాకర్, ఐరాల

మామిడికి వరుస దెబ్బలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో పలు చోట్ల శుక్రవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. కురిసిన వర్షానికి మామిడికి దెబ్బపడనుంది. ఇప్పుడున్న మామిడి కష్టాలకు ఈ వర్షం తోడు కావడంతో రైతులు కుదేలవుతున్నారు. ఈ వర్షం కురవడంతో మామిడి త్వరగా పండుగా మారి పురుగులు పడే అవకాశాలున్నాయని రైతులు కంటతడి పెడుతున్నారు. ఇక చెట్లలో కాయ ఉంటే లాభం లేదని, అధికారులు చెప్పినట్లు ఆగస్టు వరకు కోతలంటే కుదరదని తేల్చి చెబుతున్నారు. మామిడి కష్టాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

అయ్యో మామిడి రైతులు..!

- కొనేవారు లేక కాయలు పారబోస్తున్న వైనం



పులిచెర్ల(కల్లూరు): ఈఏడాది మామిడి రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ప్రత్యేకించి తోతాపురి ధర అమాంతంగా పడిపోవడంతో కూలీ కోతలు కూడా గిట్టుబాటు కాక రోడ్డు పక్కనే పారబోస్తున్నారు. కల్లూరు సమీపంలో తోతాపురి కాయలను విక్రయించేందుకు మండీలవద్దకు తీసుకువచ్చారు. అయితే ఎవరూ కొనకపోవడంతో రోడ్డు పక్కనే ట్రాక్టరు కాయలు పారబోస్తున్నారు. జ్యూస్ ఫ్యాక్టరీల వద్దకు వెళితే టోకెన్లు అందకపోవడం, మండీల వద్ద వ్యాపారులు కాయలు కొనకపోవడంతో మామిడి రైతులకు దిక్కుతోచడం లేదు.

మామిడి రైతులను ఆదుకుంటాం: కలెక్టర్

చిత్తూరు రూరల్(కాణిపాకం): జిల్లాలోని తోతాపురి మామిడి రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం చిత్తూరు నగరం గంగాసాగరంలోని శ్రీరామ్ ఫుడ్ కంపెనీ ర్యాంపు, పూతలపట్టులోని గల్లా శ్రీసన్నిధి మామిడి గుజ్జు పరిశ్రమ కంపెనీలను తనిఖీ చేశారు. ప్రతినిధులు, మామిడి పంటను పండించిన రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కంపెనీ ప్రతినిధులతో ధరల విషయంపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, ఉక్రెయిన్ యుద్ధంతో మామిడి పల్ప్ ఎగుమతి చాలావరకు తగ్గిందన్నారు. జిల్లా స్థాయిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, గుజ్జు పరిశ్రమలు, రైతులు, రైతు సంఘాల నేతలతో సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకొని ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. రైతులు మండీలు, ట్రేడర్స్ గుజ్జు పరిశ్రమల దగ్గరికి తొందరపడి వెళ్లవద్దని పక్వానికి రాకముందే కోత కోయొద్దన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైతులకు తక్కువ ధర చెల్లించకుండా చూడాలన్నారు. రైతులకు తాగునీరు, భోజనం వసతి కల్పించవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్యలపై కలెక్టరేట్లో 94910 77325, 08572–242777 సంప్రదించాలని తెలిపారు.



చిత్తూరు నగరం గంగాసాగరంలోని ర్యాంపు నిర్వాహకులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్


మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

పులిచెర్ల(కల్లూరు): మామిడి రైతుల కష్టాలు గుర్తించామని, వారికి గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన కల్లూరులోని డీఎల్‌ఎస్ మామిడి కాయల మండీని పరిశీలించారు. వివిధ రకాల మామిడి కాయల ధరలు ఇక్కడ ఎలా ఉందో ఆరా తీశారు. పులిచెర్ల మండలంలో మామిడి గుజ్జు పరిశ్రమలు లేకపోవడంతో మండీ వ్యాపారులు, రైతులతో ఆయన మాట్లాడారు. రైతుల నుంచి కిలో రూ.3.50 ధరతో కాయలు (తోతాపురి) కొనుగోలు చేస్తే తాను మూడు ఫ్యాక్టరీలతో మాట్లాడి రూ.5 ఇప్పించేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, సంతోషకుమారి, తహసీల్దార్ జయసింహ, ఎంపీడీఓ రాజశేఖర బాబు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: యోగా ప్రతి ఒకరి జీవితాలలో అంతర్భాగం కావాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయన యోగాసనాలు వేసి, వాటి విశిష్టతను తెలియజేశారు. రోజూ అరగంట నుంచి 45 నిమిషాల పాటు చిన్నా పెద్దా అనే తేడా లేకుండా యోగాసనాలు వేయాలన్నారు. శ్వాసకు సంబంధించిన ఆసనాలు వేయడం వల్ల రోగనిరోధకశక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. మనస్సును, ఆత్మను, శరీరాన్ని ఏకం చేసే మహోన్నత సాధనం యోగా అన్నారు. భారతీయ యోగాకు అంతర్జాతీయి స్థాయిలో గౌరవం, ఆదరణ పెరిగిందన్నారు. వీటితో పాటు ధ్యానం చేయడంతో మనస్సు నిశ్చలంగా ఉంటుందన్నారు. వీటిపై ఉండే ఆసక్తితోనే నగరంలో ధ్యానమందిర నిర్మాణం కోసం తన వంతుగా రూ.20 లక్షలు గతంలో ఇచ్చినట్లు గుర్తు చేశారు.





యోగాసనాలు వేస్తున్న విజయానందరెడ్డి

నేడు బంగారుపాళెంలో యోగాంధ్ర

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం రాజేంద్ర తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో ఉదయం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు యోగాసనాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పత్తాలేని సెరికల్చర్ అధికారులు

గుడుపల్లె: వర్షాలు సక్రమంగా పడకపోవడంతో కొద్దో గొప్పో నీరున్న బోరులలో మల్బరీ సాగు చేస్తూ, పట్టు పురుగుల పెంపకంపై ఆధారపడిన రైతుల ఆర్థిక స్థితిగతులను మెరు పరిచే దిశగా సెరికల్చర్ రైతులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. అసలు పట్టుపురుగుల పెంపకం రైతులకు సెరికల్చర్ శాఖాపరంగా ఉపయోగపడే సమాచారం, పథకాలు, శిక్షణ, పంట సాగులో పాటించిన యాజమాన్య పద్ధతులు, పట్టు పురుగుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..ఇత్యాదివేమీ వారికందడం లేదు. ప్రభుత్వం పట్టుపురుగుల పెంపకానికి సంబంధించి రైతులకు రాయితీపై పొడర్లు ఇచ్చేది. ప్రస్తుతం సెరికల్చర్ అధికారులు గ్రామాలను సందర్శించి పట్టుపురుగుల రైతులకు అవగాహన కార్యక్రమాలేవీ నిర్వహించిన పాపానపోవడం లేదు. మండలంలో 60 గ్రామాలలో 350 మంది రైతులు సెరికల్చర్‌పై ఆధారపడి కుటుంబాలను పోషిస్తున్నారు.

గ్రామాల్లో పర్యటించని అధికారులు

పట్టు పరిశ్రమ శాఖ అధికారులు గ్రామాల ముఖం కేసి చూడపకపోవడంతో ప్రభుత్వ రాయితీలు అందడం లేదని సంబంధిత రైతులు మండిపడుతున్నారు. గతంలో ప్రభుత్వం ప్రతి మూడు నెలలకోసారి పురుగులకు వేసే పొడర్లను రాయితీపై ఇచ్చేది. అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడంతో ఇవేవీ అందడం లేదు. అలాగే పట్టు పురుగులకు వేసే బ్లీచింగ్, సున్నం మొదలైనవి ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

దరఖాస్తులకు మోక్షం ఎప్పుడో..?

మల్బరీ పంట సాగులో రాయితీలు పొందడానికి ఆఫీసుకు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని క్షేత్ర స్థాయిలో ఉన్న అధికారి చెబుతున్నారు. వాస్తవానికి ఏడాది క్రితం రైతులు మల్బరీ మొక్కలు నాటారు. వాటి పెంపకానికి ఉపాధి హామీ పథకం కింద ఇచ్చే మెయింటెన్స్‌కు ఆరునెలల క్రితం దరఖాస్తు చేసుకున్నారు. మండలంలోని అగరం, కొత్తపల్లె, తోడేలుగట్టు గ్రామాల రైతులు వీరిలో ఉన్నారు. కానీ ఇప్పటివరకు ఆ దరఖాస్తులకు మోక్షం లేదు. సెరికల్చర్ అధికారులు మాత్రం గ్రామాల్లో రైతులను కలిసి దరఖాస్తులు తీసుకోకుండా రైతులే కార్యాలయాలకు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని క్షేత్ర స్థాయి అధికారులు భీష్మించుకున్నారు. ఉన్నతాధికారులైనా సెరికల్చర్ రైతుల సమస్యలపై స్పందించాలని, పంటలను పరిశీలించి ఉపాధి హామీ రాయితీలు అందేలా చూడాలని పట్టు రైతులు కోరుతున్నారు.

కుల వివక్ష పోరాట సమితి ధర్నా



బస్టాండులో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న కుల వివక్ష పోరాట సమితి నాయకులు

చౌడేపల్లె: దళిత సర్పంచ్‌ను స్టేజి పైకి రానీయకుండా ఎస్సీ అంటూ గుర్తు చేసి మరీ అవమానించిన బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు క్రిష్ణమ్మపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష పోరాట సమితి డివిజినల్ కార్యదర్శి డాక్టర్ చంద్ర డిమాండు చేశారు. శుక్రవారం స్థానిక బస్టాండులో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు వాసుతో కలిసి ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఇటీవల కర్నూలు జిల్లా డాణాపురంలో జరిగిన సమావేశంలో బీజేపీ నాయకుల వ్యవహరించిన తీరు దళితుల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. కుల ప్రస్తావన చేస్తూ క్రిష్ణమ్మ దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌ను వేదిక వద్ద కాళ్లవద్దనే నిలబడేలా చేయడం దారుణమన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి, క్రిష్ణమ్మలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతోపాటు పార్టీల నుంచి వారిని బహిష్కరించాలని డిమాండు చేశారు.

జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద బారులు

- ట్రాక్టర్లలోనే కాయలు మాగి పాడైపోతున్నాయని రైతుల ఆందోళన
- చాంబర్లు ఖాళీ అయితేనే ట్రాక్టర్లు పంపుతామని యజమానులు
- మద్దతు ధర కల్పిస్తామని సీఈఓ రవికుమార్‌నాయుడు భరోసా



గాజులపల్లె- బంగారుపాళెం రోడ్డుకు ఇరువైపులా బారులు తీరిన మామిడి కాయల ట్రాక్టర్లు

తవణంపల్లె: పండించిన మామిడి పంటను విక్రయించుకోవడానికి రైతులకు ముప్పుతిప్పలు తప్పడం లేదు. గత ప్రభుత్వంలో మామిడి కాయల దిగుబడి అధికంగా ఉన్నా జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులు పోటీ పడి కొనుగోలు చేశారు. ధరలు ఆశాజనకంగా రైతులకు అందించారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఇందుకు భిన్నంగా పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ఏడాది రెట్టింపు దిగుబడి రావడంతో మామిడి కాయలు ట్రాక్టర్లలో తెచ్చి జ్యూస్ ఫ్యాక్టరీల దగ్గర కిలో మీటర్ల పొడవుగా పెట్టి అన్‌లోడ్ కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. ఏ ఫ్యాక్టరీకి వెళ్లినా కాయలు అవసరం లేదు.. అవసరమైనప్పుడు అన్‌లోడ్ చేస్తామని ఫ్యాక్టరీ యజమానులు భీష్మించుకొంటున్నారు. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో మామిడి రైతులు ఆవేదన చెందుతున్నారు.

మద్దతు ధర ఇప్పిస్తాం

మామిడి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను తీసిస్తామని జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు భరోసా కల్పించారు. శుక్రవారం మండలంలోని అరగొండ సచివాలయంలో మామిడి రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చివరి దశ వరకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు కల్పిస్తామని వెల్లడించారు. రైతులు ఆలోచించి పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే ముందుగా కోయడం మంచిదన్నారు. తొందర పడి పచ్చి కాయలు కోస్తే క్రషింగ్ ఆలస్యమై రైతులకే నష్టం జరుగుతుందని వివరించారు. రైతులకు సకాలంలో టోకెన్లు ఇచ్చి ఫ్యాక్టరీకి వచ్చిన కాయలను వెంటనే అన్‌లోడ్ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, వ్యవసాయాధికారి వందన, అధికారులు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



జీసీఆర్ ఫ్యాక్టరీ గేటు ముందు అన్‌లోడ్ కోసం వేచి ఉన్న ట్రాక్టర్లు



అరగొండలో మద్దతు ధరపై భరోసా కల్పిస్తున్న జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు

బంధుప్రీతితోనే సీఎం అమరావతి నిర్మాణం

కుప్పం: ముఖ్యమంత్రికి రాజధాని కంటే బంధుప్రీతితో అమరావతి నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతామోహన్ ఆరోపించారు. శుక్రవారం కుప్పం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. అమరావతిని దేవతల రాజధానిగా సీఎం గొప్పలు చెప్పుకుంటున్నారని, తనకైతే దేవుడుగానీ దేవతులుగానీ అక్కడ కనిపించడం లేదని, అరటి చెట్లు, కర్ర తుమ్మ చెట్లు మాత్రమే కనిపిస్తున్నాయని ఛలోక్తులు విసిరారు. ముఖ్యమంత్రికి బంధువులు అమరావతిలో ఉండడం, అలాగే మంత్రులు బినామీల పేర్లతో వందలాది ఎకరాల భూములు అమరావతి చుట్టుపక్కల కొనుగోలు చేయడంతో వారి భూములకు విలువ పెంచేందుకు సీఎం మళ్లీ అమరావతి జపం చేస్తున్నారని విమర్శించారు. పైగా, అమరావతికి వేల కోట్లు కుమ్మరిస్తూ అభివృద్ధి చేస్తున్నామని అబద్ధాలు చెబుతున్నారని ఆయన అన్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం రూ.57 వేల కోట్లు గవర్నమెంట్ గ్యారెంటీతో అప్పులు చేసి, కేవలం గుంటూరు జిల్లాలోనే ఖర్చు చేయడం ఎంత మాత్రమూ సరికాదని ఆక్షేపించారు. కృష్ణానది ప్రాంతంలో 50 అంతస్తుల భవనాల నిర్మాణం ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు.